క్లుప్తంగా

ధాన్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు

పుల్‌కల్(అందోల్): తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని అందోల్–జోగిపేట ఆర్డీఓ పాండు తెలిపారు. మండల పరిధిలోని పుల్‌కల్, మిన్‌పూర్, సూరెడ్డి ఇటిక్యాల, ముదిమాణిక్యం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీల కొరతను అధిగమించడానికి రైతులు ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను తరలించినా రైసుమిల్లుల యాజమాన్యాలు తీసుకుంటాయన్నారు. తూకం వేసిన అనంతరం రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రశీదు తీసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ మాదవరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆదివారం ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అశోక్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో గంటన్నర పాటు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని సూచించారు.

ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతులో భాగంగా ఆదివారం ఉదయం 07 గంటల నుంచి 10 గంటల వరకు పటాన్‌చెరు మండలం.. ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తుల్జారామ్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తంగి డీఎస్ కాలనీ, న్యూటన్ కాలనీ, ముత్తంగి గ్రామం, గణపతిగూడెం, పోచారం గ్రామం, పాశమైలారం, ఇస్నాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయొద్దని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో చెత్త వేసే ప్రదేశాలను శుభ్రం చేసి ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఆర్పీలు సునీత, విజయలక్ష్మి, సత్యవతి, మాధవి, మంజుల పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి భక్తుల తాకిడి

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తుల దర్శనానికి శనివారం బారులు తీరారు. ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో స్థానిక ప్రాంతాల నుంచే కాకుండా కామారెడ్డి జిల్లా నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాలు, తండాల్లో అధికారుల పర్యటన



పలుగుతండా వాసులతో మాట్లాడుతున్న అధికారులు

నారాయణఖేడ్: కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యంతో పాటు వివిధ సమస్యలను గ్రామస్తులు, తండావాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాలు, తండాల వాసులు మిషన్ భగీరథ, రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీటి సరఫరా కావడంలేదని అధికారుల దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయినాయక్, నాయకులు పాల్గొన్నారు.

28న గురుకులంలో కౌన్సెలింగ్

నర్సాపూర్: కాలేజీలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 28న తమ రెండవ విడత కౌన్సెలింగ్ చేపట్టనున్నామని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. కాలేజీలో 2024 – 25 సంవత్సరానికి సీఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 28న తమ పదవ తరగతికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తమ కాలేజీ వద్ద చేపట్టే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు

- గుంతలమయంగా గ్రామీణ ప్రాంతాల రహదారులు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని బీటీ రోడ్డు పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కంకర తేలి అధ్వానంగా మారిన కంగ్టి రహదారి

గత ప్రభుత్వ హయాంలో మెంటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ స్కీంలో భాగంగా మండల పరిధిలోని గాంధీనగర్, రాసోల్, ఎడ్లరేగడి తండాతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు కంకర వేసి వదిలేశారు. కానీ.. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ బీటీ పనులను పూర్తి చేయలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్ష నాయకులకు రోడ్ల సమస్యను వివరించగా పరిష్కరిస్తామని హామీలిచ్చి ఎన్నికలు ముగిసిన తర్వాత రోడ్ల విషయం గుర్తు చేస్తే దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

– కంగ్టి(నారాయణఖేడ్)

మండల కేంద్రం కంగ్టి చౌరస్తా నుంచి చౌకన్‌పల్లి క్రాసింగ్ రోడ్డు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. అటు బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో పాటు ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తిప్పలు తప్పడంలేదని, వర్షాకాలం సమీపిస్తుండటంతో అధ్వానంగా మారిన రోడ్లను చూసి వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు

కర్ణాటక సరిహద్దులో ఉన్న నాగూర్(కే) గ్రామంతో పాటు తడ్కల్‌లోని రోడ్లు అధ్వానంగా మారి పక్కనే ఉన్న కాలువల్లోని మురుగు నీరంతా రోడ్లపైకి వచ్చి చేరడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. నాగన్‌పల్లి నుంచి గాజుల్‌పాడ్ రోడ్డు పనులను సైతం అర్ధాంతరంగా నిలిపివేశారు. పనుల విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

అడుగడుగునా గుంతలు



తడ్కల్ సమీపంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మండల పరిధిలోని తడ్కల్ గ్రామం నుంచి నల్లవాగు మీదుగా సిర్గాపూర్ మండలానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్లుకు మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అధ్వానంగా మారాయి



కంగ్టి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. కనీసం గుంతలనూ కూడా పూడ్చలేదు. దీంతో ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తోంది. వర్షాకాలం సమీపిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– మహిపాల్‌రెడ్డి, వాహనదారుడు

పనులు పూర్తిచేస్తాం



ఎన్నికలకు ముందు ఆయా గ్రామాల్లో రోడ్లు వేసేందుకు కంకర వేశాం. ఆతర్వాత కొన్ని రోజుల పాటు పనుల్లో అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని రాసోల్, ఎడ్లరెగడితండా, గాంధీనగర్ గ్రామాల్లో చేపట్టిన రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేస్తాం.

– మాధవనాయుడు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, కంగ్టి

వీడిన కిడ్నాప్ మిస్టరీ?

- మహారాష్ట్రలో వెంకటేశం మృతదేహం లభ్యం
- గుర్తించేందుకు భార్యను తీసుకెళ్లిన పోలీసులు



కల్హేర్(నారాయణఖేడ్): గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన మాజీ పోలీసు కానిస్టేబుల్ (విధుల్లోంచి తొలగించారు) మల్డోడ్డి వెంకటేశం కిడ్నాప్ మిస్టరీపై సస్పెన్స్ వీడింది. మహారాష్ట్రలోని ఉద్గీర్ ప్రాంతంలో మృతదేహాన్ని అక్కడి పోలీసులు శనివారం కనుగొన్నారు. దీంతో మృతదేహాన్ని గుర్తించేందుకు కిడ్నాప్‌నకు గురైన మల్డోడి వెంకటేశం భార్య విజయతో పాటు గ్రామస్తులను పోలీసులు అక్కడికి తీసుకెళ్లారు. ఉబ్బిపోయిన మృతదేహం ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఉంది. అయితే మృతదేహం వెంకటేశందేనని బంధువులు, గ్రామస్తులు భావిస్తున్నారు. కిడ్నాపర్లు దారుణంగా చిత్రహింసలు పెట్టి హత్య చేసినట్లు భావిస్తున్నారు. మండలంలోని కృష్ణాపూర్‌కు చెందిన వెంకటేశం ఈ నెల 23న కల్హేర్‌లో కిడ్నాప్‌నకు గురైన విషయం తెలిసిందే. నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 3 రోజులుగా కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం, పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి అనుమానితులను విచారించారు. వెంకటేశం సోదరి గంగామణి, అల్లుడు నరేందర్ సూత్రదారులుగా భావించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై వివరాలు వెల్లడించేందుకు శనివారం రాత్రి వరకు పోలీసులు అందుబాటులోకి రాలేదు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

జహీరాబాద్: మండల పరిధిలోని బూచనెల్లి గ్రామ శివారులో ఉన్న నారింజ వాగు నుంచి శనివారం రాత్రి మట్టిని అక్రమంగా తరలించారు. ఈ విషయమై అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని గ్రామ ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో నాలుగు జేసీబీలు, 10 టిప్పర్లలో అక్రమంగా మట్టి తరలించినట్లు తెలిపారు. వెంచర్లలో మట్టిని పోసేందుకు భారీ టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ జానకీరామ్‌ను వివరణ కోరగా ఉదయం స్పాట్ మీదకు వెళ్లి పరిశీలిస్తానని సమాధానం ఇచ్చారు.

మొక్కలను సంరక్షించాలి

నారాయణఖేడ్: వర్షాకాలం సమీపిస్తునందునా నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్య లు చేపడుతున్నామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా నర్సరీలను శనివారం సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండుతున్నందునా క్రమం తప్పకుండా మొక్కలకు నీరందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పట్టణ శివారులోని సంపును సందర్శించి మిషన్ భగీరథ పథకం ద్వారా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట నుంచి ఖేడ్ సంపునకు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. తాగునీటి విషయంలో మున్సిపాలిటీ వాసులకు ఇబ్బందులు లేకుండా సిబ్బందికి సూచనలు, సలహాలను ఇచ్చారు.



మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

వేసిన వలే కాళ్లకు చుట్టుకొని..


- చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



రంగులు మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మాదారం గ్రామానికి చెందిన దొమ్మపెద్ద రంగులు(55) అనే వ్యక్తి చేపలు పట్టుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. శనివారం గ్రామంలోని బ్రాహ్మణ చెరువులో చేపలు పట్టేందుకు వల వేశారు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో దొమ్మపెద్ద రంగులు చెరువులో పడిపోయాడు. అతడి కోసం తోటి ఈతగాళ్లు చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీలం మధు ముదిరాజ్‌కు సన్మానం



నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల అనంతరం సదాశివపేటకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను శనివారం చిట్కూల్ గ్రామంలోని క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి రాజు మాట్లాడుతూ నీలం మధు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ లోకసభ స్థానానికి బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్యన మాత్రమే పోటీ ఉండబోతుందని తెలిపారు. మెదక్ పార్లమెంట్ ప్రజలు మాత్రం బీసీ బిడ్డ నీలం మధుకు పట్టం కట్టబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నీలం మధుకు మద్దతుగా ప్రచారం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోహీర్ రఘునాథ్‌రావు, నల్ల శంకర్, నల్ల సుధాకర్, శంకర్, పట్నం మురళీమోహన్ పాల్గొన్నారు.

జనుము విత్తనాల పంపిణీ

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని మహబత్‌పూర్ గ్రామంలోని రైతుసేవా కేంద్రం ద్వారా రైతులకు జనుము విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ విత్తనాల పంపిణీని పరిశీలించారు. అనంతరం పలువురు రైతులకు విత్తన బస్తాలను అందజేశారు.



విత్తన బస్తాలను అందజేస్తున్న అధికారులు

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న అడివయ్య

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ఎందుకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని చట్టంలో ఉన్నా అమలు చేయడం లేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయాలని తెలిపారు. వికలాంగులపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు బస్వారాజు పాటిల్, మాణిక్యం, జయలక్ష్మి, జిల్లా నాయకులు రాంచందర్, సుభాష్, గోపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను సాధించుకుందాం

- కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

సంగారెడ్డి టౌన్: పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను అణిచివేస్తోందని ధ్వజమెత్తారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మిక హక్కులను రద్దు చేసేందుకే లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వేతనాల పెంపు, సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాబోయే కాలంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, సురేష్ నాయకులు రాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసం

- రూ.69.32 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో భారీ ఎత్తున డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మార్చి 21వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక మెసేజ్ వచ్చింది. మెసేజ్‌కు స్పందించి బాధితుడు పలు దఫాలుగా రూ.69 లక్షల 32 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదుతో పాటు యాప్‌లో చూపించే రూ.రెండు కోట్లు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

– పార్ట్ టైమ్ జాబ్ పేరుతో రూ.3.29 లక్షలు

మరో ఘటనలో పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి పార్ట్ టైమ్ జాబ్ అంటూ టెలిగ్రామ్‌కు ఏప్రిల్ 13వ తేదీన మెసేజ్ వచ్చింది. మెసేజ్‌కు స్పందించి ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి టాస్కులు పూర్తి చేశాడు. బాధితుడు మొత్తం రూ. 3.29 లక్షలు చెల్లించాడు. తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల విద్యార్థినికి ప్రోత్సాహకం



జహీరాబాద్: మండల పరిధిలోని రంజోల్ గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని శిరీష ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించింది. ఇందుకు గాను సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ శిరీషకు రూ.25వేల నగదు పారితోషికం మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ లలితమ్మ తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుకున్న శిరీష 1000/990 మార్కులను సాధించిందన్నారు. సాంఘీక సంక్షేమ గురుకుల స్థాయిలో మొదటి ర్యాంకు, జనరల్ గురుకుల స్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్లు పేర్కొంది. విద్యార్థిని ఉత్తమ మార్కులను సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిందని మునిపల్లి మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన శిరీష తల్లిదండ్రులు లీలావతి, శేఖర్ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. భవిష్యత్తులో శిరీష ఉన్నత శిఖరాలను అధిరోహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆర్‌సీఓ భీమయ్య, అధ్యాపకులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

వైభవంగా వార్షికోత్సవాలు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి ఆలయం ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దేవిదాస్ పటేల్, సంజీవ్ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, పండు, నరహరి, శ్రీనివాస్, హన్మండ్లు, సంతోష్‌పటేల్, సంగమేష్ పటేల్, మహిపాల్‌రెడ్డి, శివకుమార్, సాయిచరణ్, సాయిదిగ్వాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీతో పాటు ఆయా ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వివరించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

వట్‌పల్లి(అందోల్): విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయరత్న అన్నారు. అందోలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలం పూర్తయ్యేవరకు విత్తనాల ప్యాకెట్‌తో పాటు రశీదులను తప్పకుండా ఉంచుకోవాలని సూచించారు. విత్తనాల ప్యాకెట్లపై ఉన్న తయారీ, గడువు తేదీల వివరాలను పరిశీలించాలన్నారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, శ్రీకర్ పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): వానాకాలం సీజన్‌లో భాగంగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని పొట్టిపల్లి, తుమ్మన్‌పల్లి, ఈదులపల్లి, కృష్ణాపూర్, ఏడాకులపల్లి గ్రామాల్లో విత్తన కొనుగోలుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. అదేవిధంగా ఝరాసంగం రైతు వేదికలో వివిధ గ్రామాల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల ఏఈవోలు సుకుమార్, హరికృష్ణ, వినోద్, సంపత్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో...

హత్నూర(సంగారెడ్డి): రైతులకు విత్తనాల కొనుగోళ్లపై అవగాహన అవసరమని మండల వ్యవసాయశాఖ విస్తీర్ణ అధికారి వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని సాదుల్‌నగర్ గ్రామంతో ఆయా గ్రామాల్లో వ్యవసాయ విత్తనాల కొనుగోళ్లపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేత గుర్తించబడిన విత్తన కేంద్రాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

కంది(సంగారెడ్డి): రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని సూచించారు. ఏఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి

నారాయణఖేడ్: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని నాగల్‌గిద్ద వ్యవసాయ అధికారి వెంకటేశం అన్నారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంతో పాటు శాపూర్ క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాలం ముగిసే వరకు విత్తనాల కొనుగోలు రశీదులను భద్రపర్చుకోవాలని సూచించారు. ఏఈవో మహిపాల్, నగేష్, సంతోష్, స్రవంతి పాల్గొన్నారు.